సాక్షి
కాకినాడ

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023



డెల్టాకు నీరు విడుదల

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కింద గురువారం తూర్పు డెల్టాకు 4900,మధ్య డెల్టాకు 2600,పశ్చిమ డెల్టాకు 7200క్యూసెక్కుల నీటిని వదిలారు.



అన్నదానానికి విరాళం

గోకవరం: స్థానిక వీరభద్రునిగద్దెలో నిర్వహించే అన్నదానానికి ఆధ్యాత్మిక వేత్త కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతీదేవి దంపతులు గురూరం రూ.1.10 లక్షలు వితరణ చేశారు.

కళాస్ఫూర్తికి పట్టాభిషేకం



వస్త్ర రంగంలో కొత్తపల్లి మండలంలోని చేనేత కార్మికులు చరిత్ర సృష్టిస్తున్నారు. అగ్గి పెట్టెలో పట్టేటంత చీరను నేసిన ఘనత ఉన్న ఉప్పాడ జాంధానీ చీరలు తయారు చేసే కార్మికుల కళా నైపుణానికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. - IIలో▸

న్యూస్‌రీల్

రత్నగిరిపై భక్తుల రద్దీ



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించినట్లు అధికారులు తెలిపారు. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు 1,600 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షణ చేశారు. రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చింది. నాలుగు వేల మంది భక్తులకు అన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రత్నగిరి సత్యదేవుని సన్నిధికి శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. శుక్రవారం కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం మూల నక్షత్రం కావడం, శని, ఆది, సోమ, మంగళ వారాలు దుర్గాష్టమి, మహార్ణవమి, విజయ దశమి తగులు, మిగులు సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీమహాలక్ష్మీ నమోస్తుతే



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన బాలాత్రిపురసుందరి



శ్రీమహాలక్ష్మీదేవిగా అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు

సామర్లకోట/అన్నవరం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక పంచారామ క్షేత్రంలోని అమ్మవారు గురువారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రత్నగిరిపై ఐదో రోజు గురువారం రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను సిరులొసంగే శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజించారు. ఒక చేతిలో అక్షయపాత్ర, మరో చేతిని అభయహస్తంగా చూపుతూ వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అధిక భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం మూల సందర్భంగా శుక్రవారం కనకదుర్గ, వనదుర్గ అమ్మవార్లకు చండీహోమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

నవ మాసాల భరోసా

- ప్రతి నెల 9వ గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు
- పీఎంఎస్‌ఎంఏ పరిధిలో నిర్వహణ
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం
- మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం
- 9 నెలల్లో 26,581 మంది గర్భిణులకు లబ్ది

కాకినాడ క్రైం: గర్భందాల్చిన కొన్నాళ్లకే శిశువు ఆయుష్షు పురిటిలోనే అంతరించిపోతే.. ఇంటి వెలుగు తన ప్రతిరూపాన్ని ప్రసవిస్తూ కళ్లారా చూసుకోకుండానే కానరాని లోకాలకు తరలివెళ్లిపోతే.. ఆ ఆవేదనకు అదుపుండదు.. అంతుండదు.. ఇటువంటి బాధాకర అనుభవాలను దూరం చేసే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నడుంబిగించాయి. మాతాశిశు మరణాల నియంత్రణకు నిబద్ధతతో వ్యవహరిస్తున్నాయి. గర్భం దాల్చింది మొదలు, ప్రసవానంతరం వరకు కంటికి రెప్పలా కాచుకుంటున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్(పీఎంఎస్‌ఎంఏ) పేరుతో విశేష సేవలు కొనసాగుతున్నాయి. ప్రతి నెల 9వ తేదీన ఆరోగ్య పరీక్షలు చేసి ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని డీపీహెచ్‌ఎన్‌వో పీవీ రమణమ్మ పర్యవేక్షిస్తున్నారు

ఏం చేస్తారు...

గర్భం దాల్చిన ప్రతి మహిళ స్థానిక సచివాలయం పరిధిలో ఏఎన్‌ఎం ద్వారా చేసుకున్న రిజిస్ట్రేషన్ చేసుకున్నాక పీఎంఎస్‌ఎంఏ పరిధికి వస్తుంది. తొలి మూడు నెలలు స్థానిక ఆరోగ్య కేంద్రాల సిఫార్సుతో వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. రెండు మూడు త్రైమాసికాలలో ఈ ప్రోగ్రాం పరిధిలో మరింత ప్రయోజనాన్ని పొందుతారు. వీరికి వివిధ ఆరోగ్య పరీక్షలు చేస్తారు. తల్లి ఆరోగ్యం బిడ్డ పెరుగుదలను వైద్య నిపుణులు ఎప్పటికప్పుడు గుర్తిస్తారు. సుఖ ప్రసవానికి మార్గం సుగమం చేస్తారు. ఆహారం, ఆరోగ్యంపై తీసుకోవలసిన శ్రద్ధను వివరిస్తారు. వ్యక్తిగత పర్యవేక్షణ కూడా ఉంటుంది. కార్యక్రమం పరిధిలో ఆర్థిక సహకారానికి మహిళలు అర్హులవుతారు. తొలి చూలు మహిళకు రూ.6 వేల నగదు అందిస్తారు. ప్రమాదకర స్థితిలో ఉన్న వారిని హైరిస్క్ కేటగిరీగా విభజిస్తారు. ఈ స్థితి నుంచి బయట పడేలా సూచనలిస్తారు.



అల్ట్రా సౌండ్ స్కానింగ్ నిర్వహిస్తున్న రేడియాలజిస్టు



గర్భిణికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్న ఎల్‌టి

ప్రీ... ఎక్స్‌టెండెడ్...

సాధారణంగా ప్రతి నెల తొమ్మిదవ తేదీన గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. అందుకు 8వ తేదీనే సన్నాహక చర్యలు చేపడతారు. క్షేత్రస్థాయి ఆరోగ్య కేంద్రాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు కీలకంగా వ్యవహరించి గర్భిణుల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించి పరీక్షలకు సిద్ధం చేస్తారు. ఈ రోజును ప్రీ పీఎంఎస్‌ఎంఏ డేగా పిలుస్తారు. తొమ్మిదవ తేదీన పూర్తి కాని లేదా హాజరుకాని వారి కోసం 10వ తేదీన కూడా పీఎంఎస్‌ఎంఏ డేను నిర్వహిస్తారు.

తొమ్మిది పరీక్షలు... రెండు స్కాన్‌లు...

హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, బ్లడ్ గ్రూపింగ్, ఆర్‌హెచ్ టైపింగ్, వీడీఆర్ఎల్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్‌ఏజీ, బ్లీడింగ్ టైమ్, క్లాటింగ్ టైం, యూరిన్ అల్బుమిన్ షుగర్ పరీక్షలు నిర్వహిస్తారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్, టిఫా స్కానింగ్. ఒక్కో గర్భిణికి తన గర్భధారణ వ్యవధి మొత్తంలో కలిపి నిర్వహించే ఈ పరీక్షల కనిష్ఠ ఖర్చు మార్కెట్‌లో రూ.15 వేలకు పైనే. పలువురికి వారి ఆరోగ్య స్థితిని బట్టి మరిన్ని ఎక్కువ సార్లు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. గర్భిణి ఆరోగ్య స్థితిని బట్టి స్థానిక ఆరోగ్య కేంద్రంలోనే సేవలందించాలా లేదా ఉన్నత ఆరోగ్య కేంద్రాలకు సిఫార్సు చేయాలా అన్న విషయాన్ని నిర్ణయిస్తారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

మాతాశిశు మరణాలు సంభవించేది 98 శాతం హైరిస్క్ కేటగిరీ గర్భిణుల్లోనే. అందుకు ఈ స్థితిలో ఉన్న గర్భిణి ఆరోగ్య స్థితిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్య బృందాలు ప్రత్యేక పర్యవేక్షణను కొనసాగిస్తాయి. అందులో భాగంగా వారికి తరచూ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. స్థానిక అంగన్వాడీ కార్యకర్తలతో అనుసంధానం చేసుకొని నియమావళిలో సూచించిన ఆహారం తీసుకునేలా చేస్తారు. క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది నిత్యం గృహ దర్శనాలు చేసేలా కాలపట్టికను అమలు చేస్తారు.

తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో తరలింపు...

పీఎంఎస్‌ఎంఏ పరిధిలో పలువురు గర్భిణులను ఉన్నతాసుపత్రులకు సిఫార్సు చేస్తారు. అటువంటి వారికి తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఉచిత ప్రయాణం అందిస్తామని తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ కాకినాడ జిల్లా డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ పిరట్ల సురేష్ తెలిపారు. బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్, ఐరన్ సుక్రోజ్‌తోపాటు గైనకాలజిస్టు సిఫార్సు మేరకు వైద్య ఆరోగ్య సేవలు అవసరం అయ్యే గర్భిణుల కోసం ఈ సేవలు సిద్ధంగా ఉంటాయన్నారు.

26,581 మంది గర్భిణులకు పరీక్షలు

కాకినాడ జిల్లాలో 26,581 మంది గర్భిణీలకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది జనవరిలో 3077 మంది, ఫిబ్రవరిలో 2938, మార్చిలో 2803, ఏప్రిల్‌లో 3162, మేలో 3359, జూన్‌లో 2676, జులైలో 3096. ఆగష్టులో 2798, సెప్టెంబర్ నెలలో 2672 మందికి వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 5928 మంది హైరిస్క్ గర్భిణీలను గుర్తించారు.

నిరంతర పర్యవేక్షణ



ఎందరో ప్రసవించే సమయంలో ప్రాణాలు కోల్పోవడం లేదా గర్భంలోనే విచ్ఛిత్తి జరగడం తీరని వేదనను మిగుల్చుతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ఆధ్వర్యంలో పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. గర్భం దాల్చిన మొదటి రోజు నుంచి ప్రసవమయ్యే వరకు, ప్రసావనంతరమూ కూడా మహిళపై వ్యక్తిగత పర్యవేక్షణ ఉంటుంది. దీంతో మాతాశిశు మరణాలు తగ్గుతాయి. ప్రతి గర్భిణి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– డాక్టర్ జరపల నరసింహ నాయక్, డీఎంహెచ్‌వో

ఆదిత్య కళాశాలలకు స్వయం ప్రతిపత్తి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సూరంపాలెం **ఆదిత్య ఇంజినీరింగ్**,కాలేజ్ ఆఫ్ ఫార్మసీ,ఆదిత్య **ఫార్మసీ కళాశాలలకు** యూనివర్సిటీ గ్రాంట్స్ కమి**షన్ ఆటామనస్** (స్వయం ప్రతిపత్తి) హోదా కల్పిం**చిన్నట్లు ఆ కళాశాల** వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి **శుక్రవారం ఒక ప్రకటనలో** తెలిపారు. కళాశాలలోని **సౌకర్యాలు,విద్యాబోధన** ప్రమాణాలు తదితర అం**శాలను పరిగణనలోకి తీ**సుకుని ఇంజినీరింగ్ కళా**శాలకు 2028-29వరకూ** గుర్తింపు కల్పించార**న్నారు. ఫార్మసీ కళాశాల**లు రెండింటికీ 2032-33 **ఏడాది వరకూ 10 సంవత్స**రాలకు గుర్తింపు కల్పించారన్నారు. ఈ హోదా రావడం ఆదిత్య విద్యాసంస్థలకే గర్వకారణమన్నారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి,క్యాంపస్ డైరక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్,కె.రవిశంకర్,డి.సతీష్‌కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు.

కార్తికేయలో అవకతవకలపై రేపు విచారణ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కార్తికేయ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలో జరిగిన ఆర్థిక అవకతవకలపై సహకారశాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ కోర్టులో శనివారం విచారణ జరుగుతుందని సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ పి దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సహకార చట్టం-51 ప్రకారం ఇప్పటికే విచారణ చేయగా రూ. 21.58 కోట్లు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. దీనిపై సివిల్‌కేసు నమోదయ్యిందన్నారు. పలువురు మాజీ డైరెక్టర్లపై పోలీసులు విచారణ చేపట్టారన్నారు.సొసైటీ మాజీ డైరెక్టర్ బాలం విజయకుమార్‌కు పలుమార్లు నోటీసులు పంపినా సమాధానం లేదన్నారు. నోటీసులు కూడా వెనక్కి వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సహకారశాఖ కమిషనర్ ఆదేశాలు మేరకు సహకారశాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ కృష్ణకృతి డీసీసీబీ బ్యాంకులో సహకారశాఖ కోర్టులో విచారణ చేపట్టనున్నట్లు చెప్పారు. సహకార కోర్టులో విచారణకు హాజరుకావాలని డైరెక్టర్ నోటీసులు పంపినట్లు చెప్పారు.

చండీ రూపిణి..ముక్తి ప్రదాయిని



శ్రీమహా చండీదేవి అవతారంలో ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారు

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు గురువారం శ్రీమహా చండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవావర్ణార్చన, సువర్ణ, రజత పుష్పార్చన చేశారు. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు పర్యవేక్షించారు.

జిల్లాకు చేరిన 'ఆడుదాం' కిట్లు

- డీఎస్‌ఏలో భద్రపరిచిన అధికారులు
- వచ్చే నెలలో ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభం
- సచివాలయ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పోటీలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆడుదాం ఆంధ్రాకు క్రీడాపోటీలకు సంబంధించి స్పోర్ట్స్ కిట్లు గురువారం జిల్లాకు చేరుకున్నాయి. 15 సంవత్సరాలు పైబడిన పురుషులు, మహిళలు ఈ పోటీలు సచివాలయ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఐదు క్రీడాంశాల్లో వచ్చేనెలలో నిర్వహించనున్నారు. క్రికెట్‌కు సంబంధించి ప్రొఫెషనల్ పురుషుల కిట్లు 234, మహిళల కిట్లు 234 రాగా క్రికెట్ ఎజీ బ్యాట్-2, అబ్‌డోమినల్ ప్యాడ్స్, బ్యాటింగ్ గ్లోవ్స్, బ్యాటింగ్ ఎగ్‌గార్డులు, థైప్యాడ్, ఎల్‌బో గార్డ్, చెస్ట్‌గార్డు, వికెట్ కీపర్ గ్లోవ్స్, వికెట్ కీపర్ లెగ్‌గార్డ్స్, క్రికెట్ హెల్మెట్స్, స్టంప్స్, క్రికెట్ కిట్ బ్యాగ్ ను న్యూఢిల్లీకి చెందిన శివనరేష్ స్పోర్ట్స్ ప్రతినిధి చందన్ డీఎస్‌ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాస్ కుమార్ కు అందజేశారు. బేసిక్ కిట్లు టెన్నిస్‌బాల్ తో ఆడేందుకు పురుషులు, మహిళలు ఆడేందుకు విడివిడిగా ఒక్కొక్కరికి బిడిఎం బ్యాట్స్-2, వుడెన్‌స్టంప్స్, బాల్-1, టెన్నిస్ బాల్స్-6, కీపింగ్ గ్లౌస్-1, కిట్‌బ్యాగ్-1 కలిపి జిల్లాకు 1240 కిట్లు వచ్చాయి. బ్యాడ్మింటన్ నెట్స్-620 మ్యాట్రిక్స్ కంపెనీ నుంచి డీఎస్‌ఏకు కంపెనీ ప్రతినిధి చందన్ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ఈ కిట్లను నవంబరులో ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా పోటీలలో పాల్గొనే జట్లకు అందజేస్తామన్నారు. నరేష్ స్పోర్ట్స్ కంపెనీ ప్రతినిధి చందన్ మాట్లాడుతూ క్రికెట్ ప్రొఫెషనల్ కిట్ ఒక్కొక్కటి రూ20 వేలని, బేసిక్ క్రికెట్ కిట్ ఒక్కొక్కటి రూ3500ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సూచనల మేరకు నాణ్యమైన కిట్లను రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలకు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాలకు కిట్లను అందజేశామని ఆయన తెలిపారు.



కాకినాడ జిల్లా క్రీడామైదానంకు వచ్చిన ఆడుదాం ఆంధ్రా క్రికెట్ కిట్లను పరిశీలిస్తున్న చీఫ్‌కోచ్ శ్రీనివాస్ కుమార్; చిత్రంలో నరేష్ స్పోర్ట్స్ ప్రతినిధి చందన్ తదితరులు

కాకినాడ ఆర్టీఓగా విఠల్ కిశోర్



కాకినాడ సిటీ: కాకినాడ డివిజనల్ రెవెన్యూ అధికారిగా విఠల్ కిశోర్ నియమితులయ్యారు. ఈయన ఇప్పటివరకూ మచిలీపట్నంలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఆర్డీవో పనిచేస్తున్నారు. కాకినాడ ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణను జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలిచ్చారు.



బడుగుల బతుకులకు చేదోడు వాదోడు

- జగనన్న చేదోడు నాలుగో విడత ఆర్థిక సహాయం లబ్ధిదారుల ఖాతాలకు జమ
- ఏ వర్గమూ ఇబ్బందులు పడకూడదనేది ముఖ్యమంత్రి జగన్ ఉద్దేశం: ఎంపీ గీత

కాకినాడ సిటీ: బడుగు బలహీన, అట్టడుగు వర్గాల ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. షాపు లున్న రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీలకు జగనన్న చేదోడు కింద బటన్ నొక్కి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని లబ్దిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ప్రారంభించారు. ఇక్కడి కలెక్టరేట్లో జిల్లాస్థాయి కార్యక్రమం జరిగింది. దీనికి ఎంపీతోపాటు కలెక్టర్ కృతికా శుక్లా, కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి కార్యక్రమం పూర్తయ్యాక కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారం లబ్ధిదారుల దైనందిన జీవన గమనంలో బాగా ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి క్రమం తప్పకుండా ఏటా వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు తెలిపారు. రజకులకు, నాయి బ్రాహ్మణులు, దర్జీలకు జగనన్న చేదోడు నాలుగో విడత కింద రాష్ట్ర వ్యాప్తంగా రూ. 3.25 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందన్నారు. పథకం ద్వారా ఐదేళ్లలో కుటుంబానికి రూ. 50 వేల చొప్పున అందుతోందన్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో జిల్లాలో సుమారుగా 12,434 మంది లబ్ధిదారులకు రూ.37.29 కోట్ల మేర ఆర్థిక సహాయం పొందినట్లు వివరించారు.



జగనన్న చేదోడు పథకం కింద లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా

అర్హత ఉండి రాకున్నా మళ్లీ దరఖాస్తు

కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం కింద మూడో విడతలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 12,534 మంది దర్జీలు, నాయీబ్రాహ్మణులు, రజకులకు రూ.10 వేలు చొప్పున రూ.12.53 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఖాతాల్లో జమచేస్తున్నట్లు తెలిపారు. రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీలు ఆర్థికంగా స్థిరత్వం పొందేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న చేదోడు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉండి ఏ కారణం చేతనైనా జాబితాలో లేని వారికి రాష్ట్ర ప్రభుత్వం మరొక అవకాశం కల్పిస్తుందన్నారు. అర్హత పత్రాలతో లబ్ధిదారులు సమీపంలో ఉన్న గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాల లబ్ధి అందని వారికి కూడా మరో అవకాశం కల్పిస్తూ ఏటా జూన్, డిసెంబర్‌లలో ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతోందన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ, పెద్దాపురం డీఎల్డీవో కెవిస్వీ ప్రసాద్ రావు, డీఎల్డీవో పి నారాయణ మూర్తి, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

వెలుగులు నింపాయి



నేను నా భర్త ఇద్దరం టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాం. మాకు జగనన్న చేదోడు పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం బాగా ఉపయోగపడుతోంది. మహిళలు ధరించే అన్ని రకాల వస్త్రాలు స్టిచ్చింగ్ చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్నాల పథకాలు మా జీవితంలో వెలుగులు నింపుతున్నాయి. ఇద్దరు పిల్లల్ని చదివించుకుంటున్నాం. ఇన్నాళ్లూ సొంత గూడు లేని మాకు ఇంటి పట్టా అందించి సమాజంలో గుర్తింపునిచ్చారు. మాలాంటి వారి కష్టాలను గుర్తించి జగనన్న చేదోడు వంటి పథకాలు అమలుచేస్తున్న జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

– కొప్పనాటి నాగ మల్లేశ్వరి దుమ్ముల పేట, కాకినాడ పట్టణం.

సీఎంకు రుణపడి ఉంటాం



మా తల్లిదండ్రుల నుంచి రజక వృత్తి మీద ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి వారి అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలతో మాలో ఆత్మస్థయిర్యం కలుగుతోంది. చేదోడు పథకంతో అందిన ఆర్థిక సహాయం ఇస్త్రీ పెట్టె ఇతర అవసరమైన సామగ్రి కొనుక్కునేందుకు ఉపయోగపడుతోంది. నా భార్యకు చేయూత పథకం ద్వారా లబ్ధి చేకూరింది. కుల వృత్తిదారులను కాళ్లపై నిలబడేలా చేసిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాను.

– గురజాపు నాగేశ్వరరావు కాకినాడ గ్రామీణ మండలం, ఇంద్రపాలెం.

క్లుప్తంగా

గణిత ఫోరం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మూర్తి, శ్రీరామ్




డాక్టర్ సూర్యనారాయణమూర్తి పీవీఎల్ఎన్ శ్రీరామ్

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం అధ్యక్షుడిగా అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు, గణితావధాని డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా అమలాపురంలోని కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పీవీఎల్ఎన్ శ్రీరామ్ ఎన్నికయ్యారు. ఇటీవల విజయవాడలో ఈ ఎన్నిక జరిగింది. ఇప్పటి వరకూ రాష్ట్ర గణిత ఫోరం గౌరవ సలహాదారునిగా పనిచేసిన డాక్టర్ సూర్యనారాయణ మూర్తి తాజా నూతన కార్యవర్గంలో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర సంఘ కార్యదర్శిగా పనిచేసిన శ్రీరామ్ ఇప్పుడు ఉపాధ్యక్ష పదవి స్వీకరించారు. గణిత ఉపాధ్యాయులకు తద్వారా విద్యార్థులకు గణిత చిట్కాలు, మెలకువలు చెబుతూ రాష్ట్రాన్ని గణితపరంగా మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని డాక్టర్ సూర్యనారాయణమూర్తి, శ్రీరామ్ తెలిపారు.

ఇంటర్ ఫెయిల్ విద్యార్థులకు సువర్ణావకాశం

పరీక్ష ఫీజు గడువు పెంపు



ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి

రాయవరం: ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించే గడువును పొడిగించినట్లు ఇంటర్ బోర్డు డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరభ్‌గౌర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష ఫీజు గడువును నవంబరు 30వ తేదీ వరకూ పొడిగించారన్నారు. ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు, మధ్యలో కళాశాల మానివేసిన వారు, జనరల్, ఒకేషన్ కోర్సులు చదివిన విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా ఫీజు చెల్లించే అవకాశముందన్నారు. నిర్ణీత ఫీజుల మొత్తాన్ని చెల్లించి, పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఫెయిలైన విద్యార్థి తిరిగి కళాశాలలో అడ్మిషన్ పొందిన అన్ని పరీక్షలకు హాజరైతే ఎక్కువ మార్కులు వచ్చిన దానిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అలాగే కంపార్ట్‌మెంటల్, ఫెయిల్ అని కాకుండా ఒకేసారి ఉత్తీర్ణులైనట్లుగా సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. అలాగే కళాశాలలో తిరిగి అడ్మిషన్ పొందిన విద్యార్థులకు జగనన్న అమ్మఒడి, ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో ప్రవేశం పొందవచ్చన్నారు.

కళాస్ఫూర్తికి పట్టాభిషేకం

రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా అత్యున్నత అవార్డులను ప్రకటిస్తుంది. వివిధ రంగాల్లో నిష్ణాతులకు తగిన గుర్తింపు ఇస్తుంది. వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుల ద్వారా వారికి సముచిత స్థానం కల్పిస్తోంది.. అదే విధంగా ఈ ఏడాది కూడా వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్టులు 27 మంది ప్రముఖులను రాష్ట్ర కమిటీ ఎంపిక చేసింది. తమకు తాముగా దరఖాస్తు చేసుకున్న వారిని, జిల్లా కలెక్టర్లు, యంత్రాంగం కుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఎంపిక చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో కమిటీ అర్హులను ప్రకటించింది.

- వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక
- తూర్పుగోదావరి జిల్లా నుంచి రామబ్రహ్మం
- ఆర్ట్ అండ్ కల్చర్ విభాగంలో 'ఉప్పాడ'



ఉప్పాడ చేనేత సంఘంలో చీరలు విక్రయిస్తున్న సిబ్బంది

పిఠాపురం: వస్త్ర రంగంలో కొత్తపల్లి మండలంలోని చేనేత కార్మికులు చరిత్ర సృష్టిస్తున్నారు. అగ్గి పెట్టిలో పట్టేటంత చీరను నేసిన ఘనత ఉన్న ఉప్పాడ జాంధానీ చీరలు తయారు చేసే కార్మికుల కళా నైపుణ్యానికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. చేనేత ద్వారా రూపుదిద్దుకుంటున్న జాంధానీ చీరలు మహిళా లోకంలో మచ్చుతునకలుగా నిలుస్తూ అనతి కాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించాయి. ఇప్పటి వరకూ పేటెంట్ హక్కుతో సహా పలు జాతీయ రాష్ట్ర అవార్డులు సొంతం చేసుకున్న ఉప్పాడ కాటన్, సిల్క్ కు మరో గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి అందిస్తున్న వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఆర్ట్ అండ్ కల్చర్ విభాగంలో కొత్తపల్లి మండలం ఉప్పాడ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం సొంతం చేసుకుంది. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఉప్పాడ జాంధానీ చీరల తయారీ కార్మికులతో 1938లో ఉప్పాడ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం ఏర్పాటు చేశారు. అప్పట్లో 300 మంది సభ్యులతో ఈ సంఘం ప్రారంభించారు. ప్రస్తుతం 200 మందితో కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఏటా కొత్త కొత్త డిజైన్లను పరిచయం చేస్తూ కార్మికులకు తోడ్పాటు ఇవ్వడంలో సంఘం ముఖ్య భూమిక పోషిస్తోంది. సంఘం ఆధ్వర్యంలో మగ్గాలపై జాంధానీ చీరలు తయారు చేస్తుండగా, సంవత్సరానికి రూ.14 లక్షల టర్నోవర్ కలిగి ఉంది. ఏ ప్రభుత్వంలోనూ ఇలా గుర్తించి అవార్డులు ఇవ్వలేదని సంఘం ఇన్‌చార్జి అధికారి కె.చేతన్ అన్నారు. ఎన్నో ఏళ్లుగా చేనేత కార్మికులకు అండగా నిలిచిన ఈ సంఘానికి ఇన్నాళ్లకు ప్రభుత్వ పరంగా గుర్తింపు లభించిందని సంఘం మేనేజర్ వెంకట సూర్యనారాయణ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ వచ్చాక నేతన్న నేస్తంతో నేత కార్మికులను ఆదుకోవడంతో చేనేత రంగం మరింత అభివృద్ధి సాధించిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉప్పాడ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి చర్యలు తీసుకుంటున్నామని, సంఘంలో సభ్యుల సంఖ్యను పెంచుతామన్నారు. ప్రస్తుతం వచ్చిన అవార్డు కార్మికులందరికీ చెందుతుందన్నారు. గతంలో పదుల సంఖ్యలో ఉండే మగ్గాలు ఇప్పుడు వందల సంఖ్యకు చేరుకున్నాయని, చీరల ఉత్పత్తి సైతం గణనీయంగా పెరిగిందన్నారు. సంఘం టర్నోవర్ పెంచడానికి కార్మికులను మరింత ఉత్సాహంగా పని చేయించడానికి ఈ అవార్డు ఉపయోగపడుతుందన్నారు.


'భేతవోలు'కు పురస్కారం



ఆచార్య భేతవోలు రామబ్రహ్మం దంపతులతో సాహితీ అభిమానులు

నల్లజర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ 2023కి అవార్డులను గురువారం ప్రకటించారు. తెలుగు భాష- సాహిత్యం విభాగంలో తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన ఆచార్య భేతవోలు రామబ్రహ్మం ఉన్నారు. సాహిత్య రంగానికి ఆయన అందిస్తున్న సేవలకు ఈ అవార్డు రావడంపై ఇక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భేతవోలు రామబ్రహ్మం అవధాన రాజ్యాంగ నిర్మాత. తెలుగు భాషకు ఆయన చేసిన విశేష సేవలకు గాను కేంద్రభాషా సమ్మాన్ పురస్కార్-2021కు ఆయన ఇటీవల ఎంపికయ్యారు. అలాగే 2018లో తెలుగు సాహిత్యానికి చేసిన సేవలకు గాను రాష్ట్రపతి ప్రశంసాపత్రం అందుకున్నారు. నల్లజర్లలో 1948 జూన్ 10న అతి సామాన్య కుటుంబంలో ఆయన జన్మించారు. కష్టాలే తోడుగా ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. తర్వాత కొవ్వూరు సంస్కృత పాఠశాలలో భాషా ప్రవీణ చేశారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు చదివారు. తర్వాత నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య తూమాటి దోణప్ప పర్యవేక్షణలో తెలుగు వ్యాకరణాలపై సంస్కృత ప్రాకృత వ్యాకరణాల ప్రభావం అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. హైదరాబాద్‌లో వాఙ్మయి త్రైమాసిక పత్రికలో కొన్నాళ్లు పనిచేశారు. అదే పత్రికను బొమ్మూరుకు తీసుకువచ్చి పరిశోధనలో ప్రామాణికతను పాటిస్తూ తెలుగు సాహిత్యానికి విశిష్టమైన సంచికగా రూపొందించడంలో విశేష కృషి చేశారు. 2005లో హైదరాబాద్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా చేరారు. అక్కడ రావూరి వెంకటేశ్వర్లు ప్రోత్సాహం, ప్రేరణతో భాషా ప్రవీణ చేశారు. 25 ఏళ్లలో 300 వరకూ అవధానాలు చేశారు. తర్వాత లెక్కలేనన్ని అవధానాలకు సంచాలకత్వం వహించారు. కొత్త గోదావరి వంటి పద్యకావ్యాలే కాకుండా నాటకాలు రాశారు. సాహిత్య వ్యాసాలు, పరిశోధనా గ్రంథాలు రాశారు. సంస్కృత నాటకాలకు వ్యాఖ్యానాలు రాసి ఎనలేని కీర్తి గడించారు. దేవీ భాగవతం వంటి రచన ద్వారా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. ప్రస్తుతం ఆయన వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పీకే రావు



అంబాజీపేట: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా అంబాజీపేటకు చెందిన పేరి కామేశ్వర రావు (పీకే రావు) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జి.అనంతరాము నుంచి లిఖితపూర్వక ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన గురువారం తెలిపారు. పీకే రావుకు బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడంపై కోనసీమ వ్యాప్తంగా పార్టీలకతీతంగా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తనకు చైర్మన్ పదవి రావటంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బీసీ సంక్షేమ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులకు రావు కృతజ్ఞతలు తెలిపారు.

కొబ్బరిచెక్కల వేలం ఖరారు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామికి మొక్కుబడిగా సమర్పించిన కొబ్బరి చెక్కలను సంవత్సరం పాటు తీసుకొనుటకు గురువారం దేవదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. 2023 నవంబర్ 16 నుంచి నుంచి 2024 నవంబర్ 15 వరకు సంవత్సరం పాటు కొబ్బరి చెక్కలు తీసుకొనుటకు ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు పర్యవేక్షణలో బహిరంగ వేలం ఈ టెండర్ ప్రక్రియ ద్వారా నిర్వహించారు. టెండర్‌లో నలుగురు వ్యక్తులు వేయగా హెచ్చుపాటను కాకినాడ తిమ్మాపురం వాస్తవ్యుడు పోల్నాటి నాగ వెంకట రమణ రూ.44,55,000లకు హెచ్చు పాట దక్కించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాకర శ్రీనివాస్, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- రూ.4.86 లక్షల విలువైన సారా ధ్వంసం



పట్టుబడిన సారా ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, సెబ్ అధికారులు

కిర్లంపూడి: నిండు ప్రాణాలను బలిగొంటున్న సారాను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. కాకినాడ జిల్లా పరిధి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో 697 కేసుల్లో పట్టుబడిన రూ.4.86 లక్షల విలువ చేసే 4,050 లీటర్ల సారాను గురువారం కిర్లంపూడి మండలం జగపతినగరం పరిధిలో ధ్వంసం చేశారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (సెబ్) జి.ప్రేమ్‌కాజల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర కమిషనర్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి ఎం.రవిప్రకాష్ ఆదేశాల మేరకు జిల్లాలోని నాటు సారా బట్టీలపై, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై నిఘా పెంచామన్నారు. ఇందులో భాగంగా ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, తుని సెబ్ స్టేషన్ల పరిధిలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీలలో పట్టుబడిన సారాను ధ్వంసం చేశామని ఆయన తెలిపారు. సారా అక్రమ రవాణా, తయారీదారులపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. మరోసారి సారా విక్రయాలకు, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్ కుమార్ సింగ్, పి.సునీల్‌కుమార్, ప్రత్తిపాడు సీఐ పందిరి అశోక్, ఐ.నాగవల్లి, కేవీ స్వామి, బి.శ్రీనివాసరావు, వీఆర్ఏలు ఉన్నారు.

క్షణికావేశం ప్రాణం తీసింది

కొత్తూరులో వ్యక్తి హత్య



హత్యకు గురైన గుత్తుల శ్రీను (ఫైల్)

కాకినాడ రూరల్: దొంగతనం మోపాడనే ఆవేశంతో చోటుచేసుకున్న వాగ్వాదం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. క్షణికావేశంతో సెంట్రింగ్ కర్రతో బలంగా తలపై కొట్టడంతో గణపవరం మండలం కొయ్యేరుకు చెందిన గుత్తుల శ్రీను (31) అక్కడికక్కడే మృతి చెందాడు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీ రాయుడు పాలెం కొత్తూరు వద్ద గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి తిమ్మాపురం పోలీసుల కథనం ప్రకారం... గుత్తుల శ్రీను గతంలో అగర్వాల్ ఆయిల్ శుద్ధి కర్మాగారంలో వర్కర్‌గా పనిచేసేవాడు. అదే సమయంలో అక్కడ పనిచేస్తున్న పిఠాపురం మండలానికి చెందిన ఒక వివాహితతో పరిచయం ఏర్పడింది. దీంతో ఆ వివాహితతో శ్రీను కొత్తూరు వద్దకు వచ్చి అద్దె ఇంట్లో ఎనిమిది నెలలుగా నివాసం ఉంటున్నాడు. ఇదిలా ఉండగా వీరి వెనుక పోర్షన్‌లో డైలీ కూలీగా పనిచేసుకునే ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన కోస మద్వీ ఉంటున్నాడు. శ్రీను తాపీ పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వారికి చెందిన మిషన్ కుట్టుమెషీన్ హెడ్ మాయమవ్వడంతో వెనుక పోర్షన్‌లో ఉంటున్న మద్వీపై అనుమానం పెంచుకుని గురువారం నిలదీశాడు. ఇద్దరి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. ఒకరిని నొకరు తోసుకున్నారు. దీంతో మద్వీ అక్కడే ఉన్న సెంట్రింగ్ కర్రతో శ్రీను తలపై బలంగా మోదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనుతో సహజీవనం చేస్తున్న మహిళ ఫిర్యాదు మేరకు తిమ్మాపురం ఎస్సై షరీఫ్ కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలను విచారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

ముచ్చటగా మూడో స్థానం

- ఇన్‌స్పైర్ మనక్ ఆవిష్కరణలకు 4,168 నామినేషన్లు
- రాష్ట్రంలో ఉమ్మడి తూర్పుగోదావరికి గుర్తింపు




రాయవరం: విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక అంశాలపై ఆసక్తి పెంచి వారితో సరికొత్త ఆవిష్కరణలు రూపొందించేలా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు ఏటా ఇన్‌స్పైర్ మనక్ విజ్ఞాన మేళాను నిర్వహిస్తున్నారు. ఆవిష్కరణల రూపకల్పనకు ప్రభుత్వం విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదును అందిస్తూనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి నగదు పారితోషికాలను అందజేస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నుంచి నామినేషన్లు ఆహ్వానించారు. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి గరిష్టంగా మూడు, ఉన్నత పాఠశాలల నుంచి గరిష్టంగా ఐదు నామినేషన్ల చొప్పున ఆహ్వానించారు. జూన్ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకూ విద్యార్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలోని 2,145 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 4,168 నామినేషన్లను ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేశారు. గత విద్యా సంవత్సరంలో 4,035 నామినేషన్లు రాగా, ఈ ఏడాది 133 నామినేషన్లు అధికంగా వచ్చాయి. ప్రాజెక్టుల రూపకల్పనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా మూడో స్థానంలో నిలిచింది. గత విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవడం గమనార్హం. పదేళ్లుగా మొదటి మూడు స్థానాల్లో ఏదో ఒక స్థానంలో నిలుస్తోంది.

ఎంపికైన ప్రాజెక్టుకు రూ.10 వేలు

జిల్లాలో 6-10 తరగతి చదువుతున్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు నూతన ఆలోచనలతో సృజనాత్మక ఆవిష్కరణలు రూపొందించాలి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఎంపిక చేసిన వినూత్న ఆలోచనలు కలిగిన ప్రాజెక్టుకు రూ.10 వేల నగదును విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు. ప్రాజెక్టు తయారీ, జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలో పాల్గొనేందుకు వీటిని ఖర్చు చేయాల్సి ఉంది. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన జిల్లా ఇన్‌స్పైర్ మనక్‌ను నవంబర్‌లో ఉమ్మడి జిల్లా కేంద్రం కాకినాడలో ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. గత విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 302 ప్రాజెక్టులు ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికయ్యాయి. ఎంపికైన ప్రాజెక్టుల వివరాలను ఇప్పటికే ఆయా పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ తెలియజేసింది. త్వరలో ఏర్పాటు చేసే జిల్లా స్థాయి మనక్‌లో ఎంపికైన ప్రాజెక్టులను విద్యార్థులు సిద్ధం చేసుకుని ప్రదర్శించాల్సి ఉంది.


ఇదే స్ఫూర్తి కొనసాగించాలి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 368 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 1,626 నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులు ఇన్‌స్పైర్ మనక్ ఆవిష్కరణలకు మంచి స్పందన కనబర్చారు. నూతన ఆవిష్కరణలు రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహించారు. ఇదే స్ఫూర్తిని ముున్ముందు కొనసాగించాలి.

– జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం

త్వరలో ప్రదర్శనకు చర్యలు



ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ల విషయంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో స్థానంలో నిలవడం సంతోషించదగ్గ విషయం. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు అభినందనలు. త్వరలోనే 2022-23 జిల్లా ఇన్‌స్పైర్ ప్రదర్శనను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతాం. ఎప్పుడు చేసేదీ త్వరలో ఆయా పాఠశాలలకు తెలియజేస్తాం.

–జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

మొసలి కలకలం



చల్లపల్లిలో మొసలిని పట్టుకోవడానికి వలలు సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి వైరుపేటలోని ప్రధాన పంట కాలువలో మొసలి సంచరిస్తుందని స్థానికులు గురువారం గుర్తించారు. ఈ మేరకు అటవీశాఖ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై దాన్ని పట్టుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు. వలలతో కాలువలో అడ్డకట్టలు వేసి మొసలిని బంధించేందుకు చర్యలు చేపట్టారు.



గదను అందుకుంటున్న ఆలయ నిర్వాహకులు

అమ్మవారికి వెండి గద సమర్పణ

కపిలేశ్వరపురం: అంగరలోని చేనేత సహకార సంఘం సమీపంలోని విజయదుర్గాంబిక వారికి గ్రామానికి చెందిన కుడకా గణపతి కుమారుడు శ్రీనివాస్, లక్ష్మీనారాయణమ్మ దంపతులు రూ.35 వేల విలువైన వెండి గదను సమర్పించారు. ఆలయ అర్చకులు కొలువుల మల్లికార్జున రావు అమ్మవారికి అలంకరించారు. దాతను ఆలయ నిర్వాహకులు అభినందించారు.

చికిత్స పొందుతూ ఖైదీ మృతి

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన గెల్లా బ్లెస్సింగ్ జాబ్‌బాబు(55) రాజమహేంద్రవరం టూ టౌన్ పీఎస్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడు. 2002 నుంచి రాజమహేంద్రవరం కేంద్రకారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. గత నెల 28న అనారోగ్యంతో అతడు కాకినాడ జీజీహెచ్‌లో చేరాడు. చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. సడన్ రెస్పిరేటరీ, కార్డియాక్ అరెస్టు వల్ల జాబ్‌బాబు చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.